# రైలు బండి

*గవరసాన సత్యనారాయణ*

This page uses Unicode. If your computer does not display Telugu script, please read and enjoy the pdf version. If you would like to set your computer up to display Telugu Unicode, please see help here

అది 1942 సంవత్సరము అనుకుంటాను. ఆ సంవత్సరమే మొదటి తరగతిలో చేరాను. ఈ రోజున బడి ఉన్నా, బడి మాన్పించి పిన్ని గారింటికి తీసుకుని వచ్చింది అమ్మ. బడికి పోనక్కరలేదు అన్న సంతోషంతో పిన్ని గారింటికి వచ్చాను. పిన్నిగారింటికి దగ్గరలో రైలు స్టేషను ఉంది. ఎంత దగ్గరగా ఉంది అంటే రైలు బయలు దేరేముందు వేసే కూత, ఇంజనులోంచి ఆవిరిని వదిలినప్పుడు వచ్చే "ఇస్" శబ్దము కూడా వినిపిస్తాయి. రైలు పట్టాలు పై వేగంగా పోయే గూడ్సు బళ్ళుచేసే చప్పుళ్ళు నిద్దురలో కూడా వినిపిస్తాయి. పిన్నిగారింటికి వచ్చినప్పుడు నా పడక డాబా పైనే. వెల్లికిలా పడుకుంటే ఆకాశములో మెరిసే నక్షత్రాలు, లేచి కూర్చుంటే ఎదురుగా రైలు పట్టాలు కనిపిస్తాయి.

"జాగ్రత్త! రైలు పట్టాలపై ఆడుకోవద్దు. రైలు స్టేషనులో మిరపకాయల బస్తాలు, దూది బస్తాలు ఉంటాయి. దూది బస్తాపై కూర్చుని వచ్చేపోయే రైలు బళ్ళను చూడు. మిరపకాయల బస్తాలపై కూర్చుంటే తుమ్ములు వస్తాయి. ముక్కు పొడుం పీలిస్తే చిన్నాన్నకు ఎలా తుమ్ములు వస్తాయో అలాగునే నీకు కూడా తుమ్ములు వస్తాయి" అని అమ్మ చెప్పింది.

చిన్నాన్న ముక్కుపొడుం పీల్చి "ఆచ్" అని తుమ్ముతాడు. జేబులోంచి నల్లబడిన తెల్ల జేబు రుమాలుని తీసి, ముక్కును తుడుచుకుని, రుమాలుని మడిచి, మళ్ళీ జేబులో పెడతాడు. చిన్నాన్న మా బడిలో బడి పంతులుగా పని చేస్తున్నాడు. ఈ రోజు శలవు పెట్టి రైలు బండిలో సామర్లకోట వెళ్ళాడు. సామర్లకోటలోనే మెయిలు బండి ఆగుతుందట! మద్రాసు పోయే రైలు బండిలో గాంధీగారు వస్తున్నారట! సామర్లకోట స్టేషనులో ఖద్దరు టోపీలు పెట్టుకున్న కాంగ్రెసు కార్యకర్తలకు మూడు రంగుల జెండాలను ఇస్తారట! చిన్నాన్న బయలుదేరేముందు పిన్ని అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. " ఏమిటండీ? ఆ వేషం? ఖద్దరు చొక్కా, ఖద్దరు పంచె,

ఖద్దరు సంచి సరిపోవా? ఆ తలపాగా ఎందుకు? ఎందుకండీ శలవు పెట్టేరు? మూడు రంగుల జెండా పట్టుకుని, ఎండలో నిలబడి, గాంధీగార్ని చూస్తే మీకు ఏమి వస్తుంది?" పిన్ని మాటలకు చిన్నాన్న తొణక లేదు, బెణక లేదు. "గాంధీగారి చలవవల్లన మనకు స్వరాజ్యము వస్తే, మా బడి పంతుళ్ళ జీతాలు రెట్టింపు అవుతాయి. "క్విట్ ఇండియా" తీర్మానముతో తెల్ల దొరలు సీమకు పోతే, కాసులన్నీ మనకే మిగులుతాయి. మా జీతాలు పెరుగుతాయి. పెరిగిన జీతంతో ప్రతి నెలా నువ్వు ఒక కాసు బంగారం కొనుక్కోవచ్చు" అని సర్ది చెప్పి సామర్లకోట ప్రయాణమయ్యాడు.

రైలు బండి వచ్చేముందు మా స్టేషనులో గంటలు కొడతారు. గుడిలో గంటలా ఉండదు. వేలాడే రెండు అడుగుల ఇనుప బద్దీపై "గణ గణ" మని శబ్దం వచ్చేలా నిముషంపాటు ఇనుప ముక్కతో కొట్టి, చివరన రెండో లేక మూడో దెబ్బలు వేస్తారు. మూడు సార్లు విడివిడిగా గంటలు కొడితే 'అప్ ట్రయిను' వస్తుందని, రెండు సార్లు గంటలు కొడితే 'డవును ట్రయిను' వస్తుందని ఆ గంటలు విన్నవారికి తెలుస్తుంది. ఈ గంటల శబ్దాలు మా పిన్నిగారింటికే కాదు, ఆ వీధిలో ఉన్న వారందరికీ వినిపిస్తాయి.

పిన్నిగారికి పిల్లలు లేరు. అందువల్లనేమో నన్ను ముద్దుగా చూసుకుంటుంది. తెల్లవారు జామునే లేచి, దీపం వెలిగించి, "చదుకో నాయనా" అని నన్ను బుజ్జగించి, తన పని చూసుకుంటుంది. అన్నవరము పోయే రైలు వచ్చే సమయానికి స్నానం, పూజ పూర్తి చేసి, గేదె పాలను పితుకుతుంది. నురుగతో ఉన్న పచ్చిపాలను గ్లాసు నిండా పోసి, నాకు ఇచ్చేది. నా తల నిమురుతూ మా అమ్మతో "ఆ దేవుడు ఎక్కడ ఉన్నాడో తెలీదు కాని, ఈ బుడుతడుని చూసుకునే అవకాశం లేకుండా బావను తీసుకుని పోయాడు" అని చెప్పి కళ్ళ నీళ్ళను పెట్టుకునేది.

స్టేషను మేస్టారు ప్లాట్ ఫారము మీదకి వచ్చి, నన్ను చూసి, "నీకు తెలుసునా? వచ్చేది, మిలిటరీ స్పెషల్. వేగంగా పోతుంది. రైలుకు దూరంగా ఉండు" అని హెచ్చరించాడు. తలపై టోపీ పెట్టుకున్నాడు. ఎడమ చేతిలో ఎర్ర జెండా, కుడి చేతిలో పచ్చ జెండాలను పట్టుకున్నాడు. రైలు బండి వేగంగా వస్తోంది. చెవులు చిల్లి పడేట్లు పొడుగుపాటి కూతను కూసింది. రైలు బండి వేగానికి ధూళి లేచింది. స్టేషన్ ప్లాట్ ఫారము అదిరిపోయింది. రైలు బండిని ముందుకు సాగిపొమ్మని పచ్చని జెండాను అటూ, ఇటూ ఊపుతున్నాడు స్టేషను మేస్టారు. రైలులో నల్లని మచ్చలున్న ఆకు పచ్చని దుస్తులతో సైనికులు కనిపించారు. వారి వంక చూస్తూ ఆనందంతో చేతులు ఊపాను. నన్ను చూసి, బిస్కెట్ పేకెట్లను నావైపు విసిరారు. ఎదురుగా కనిపించిన నన్నే వారి పిల్లవాడిగా ఊహించి బిస్కెట్ పేకట్లను విసిరి ఉంటారు. ఆ బిస్కెట్ పేకెట్లను పట్టుకుని పిన్నిగారింటికి పరుగున పోయాను.

"ఏమిటో అక్కా! మీ మరిదిగార్ని సామర్లకోట పోవద్దన్నాను. గాంధీ గారు రైలు బండిలోంచి దిగరు. సభ చెయ్యరు. గాంధీ గార్ని చూడటానికి మీరు ఒక్కరే ప్లాట్ ఫారము మీద ఉంటారా? వేల కొలది జనం వచ్చి ఆయన్ని చూస్తారు గదా? దానితో పాటు పోలీసులు. వారి లాఠీలు. తొక్కిసలాట జరిగితే ఏమవుతుందో ఆలోచించారా? అని అడిగాను. ఆయన ఏమన్నారో తెలుసా? "గాంధీ గారు, దేముడితో సమానం. నువ్వు రోజు పూజలు చేస్తావు గదా? ఎందుకు? ఆ దేవుడు ప్రత్యక్షమవ్వాలనే కదా? ఆ దేవుడే గాంధీజీ రూపంలో సామర్లకోట వస్తున్నాడు. ఆయన్ని చూడాల్సిందే" అన్నారు మీ మరిది.

నేను బిస్కెట్ పేకెట్లను పట్టుకుని ఇంటికి పోయేసరికి ఇలా సాగుతోంది సంవాదం. నన్ను చూసిన పిన్ని "సత్తిబాబూ, చిన్నాన్నగారు వచ్చారా? అన్ని రైళ్లు చూసావా?" అని నన్ను అడిగింది. "రైళ్ల బళ్ళలోంచి దిగిన వారిలో చిన్నాన్న లేరు. తాటిపర్తి పోయి ఇందనవారి ఆయుర్వేద వైద్యము చేయించుకునే వారు, నేతి డబ్బాలు పట్టుకుని దిగిన వర్తకులు, అన్నవరము పోయి గుండు గీయించుకున్న భక్తులు దిగారు" అని చెప్పాను.

మధ్యాహ్న సమయము. కడుపులో రైళ్ళు ఆకలితో పరుగులెడుతున్నాయి. "కాళ్ళు చేతులు కడుక్కుని రా. భోజనము చేద్దువు గాని" అని పిన్ని వంట గదిలో పీట వేసి కూర్చో పెట్టింది. అన్నం, పప్పు, నెయ్యి, ఆ తరువాత కూర, చారు, పెరుగులతో భోజనము పెట్టింది. నాకు వడ్డిస్తూనే మా అమ్మతో మాట్లడుతోంది. " చూసావా అక్కా? సత్తిబాబుకి నేనంటే ఎంతప్రేమో! బిస్కెట్లను తను తినకుండా నేరుగా తీసుకుని వచ్చి నాకు ఇచ్చాడు.ఆ చిన్ని బుర్రలో ఎన్ని ఆలోచనలు ఉన్నాయో నాకు తెలీదు కాని, తలపై వెన్న ముద్ద వేస్తే కరిగిపోతుంది" అని నావంక ప్రేమగా చూసి "తిను" అని కొసరు వడ్డించింది.

చూడు సత్తిబాబూ, చిన్నాన్న టెన్ అప్ రైలు బండిలో సామర్లకోట వెళ్ళారు. సాయంత్రము చీకటి పడే వేళ సామర్లకోట నుండి నైన్ డవును రైలు బండిలో వస్తారు. డవును ట్రెయిన్లు లోంచి దిగిన వారిని అందరిని చూడు, చిన్నాన్న కనిపిస్తారు. ఇంటిలో కూర్చుంటే నీకు ఏమి తోచదు గదా! రైలు స్టేషనుకు పోయి ఆడుకో. రైలు పట్టాల మీద మాత్రము ఆడుకోకు" అని పిన్ని హెచ్చరించింది.

పిన్నిగారింటిలో ఆడుకొనుటకు తగిన ఆట స్థలము లేదు. దగ్గరలో ఉన్న రైలు స్టేషనే ఆటస్థలము. గేదెల్ని మేపుతున్న కుర్రాళ్ళు రైలు పట్టాలపై ఆడుకుంటున్నారు. అందులో ఒకడు రైలు పట్టాలపై చెవిని పెట్టి, "ఒరేయ్, రైలు వస్తోంది. గేదెల్ని పక్కకు తోలరా" అని తోటి పశువులకాపర్లకు చెపుతున్నాడు. అటూ, ఇటూ చూసినా నాకు రైలు బండి కనిపించలేదు. అమ్మా, పిన్ని చెప్పిన మాటలు ప్రక్కన పెట్టి, రైలు పట్టాలపై చెవిని పెట్టి విన్నాను. టక్, టక్ అన్న శబ్దము మెల్లగా వినిపిస్తోంది కాని రైలు బండి కనిపించలేదు. ఇంతలో స్టేషను మేస్టారు

ఎర్ర జెండా, పచ్చ జెండాలను పట్టుకుని ప్లాట్ ఫారముపై కనిపించాడు. అంటే రైలు బండి వస్తోంది అన్నమాట. అప్పటికి సాయంత్రము అయింది.

సామర్లకోట నుండి వచ్చిన నైను డవును రైలు మా గొల్లప్రోలు స్టేషనులో ఆగింది. జనము దిగారు. అందరి దగ్గరనుండి స్టేషను మేస్టరు టికెట్లను పుచ్చుకున్నాడు. ఇద్దరు మాత్రము టికెట్లను చూపకుండా "మంత్లీ పాస్" అని చెప్పి బయటకు పోయారు. రైలు దిగిన వారు అందరు బయటకు పోయిన తరువాత ఇంటికి పరుగున పోయాను. "పిన్నీ, పిన్నీ, చిన్నాన్నగారు నైను డవును రైలులో రాలేదు" అని పిన్నికి చెప్పేను. దూరముగా అమ్మ నిలబడి ఉంది. నేను చెప్పిన మాటలు వింది. పరుగు పరుగున వచ్చి పిన్నిని కౌగలించుకుంది. పిన్ని కళ్ల నుండి నీరు కారుతోంది. "అక్కా, మీ మరిదిగారు రాలేదు" అంది. "అవును మా మరిదిగారు రాలేదు" అంది అమ్మ.

అక్క చెల్లెళ్ళు ఇద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. అమ్మ నన్ను పిలుస్తోంది. "చీకటి పడి పోయింది. రా సత్తిబాబూ, అన్నము తిందువుగాని" అని చెప్పి వంట ఇంటిలోనికి తీసుకుని వెళ్ళి భోజనము పెట్టింది. పిన్నిగారింటికి ఎప్పుడు వెళ్ళినా, పిన్నే నాకు భోజనము పెట్టేది. ఈ రోజు ఏమయిందో మరి, అమ్మ భోజనము వడ్డించింది. డాబా పైకి తీసుకుని వెళ్ళి, పక్క వేసి, నా పై దుప్పటి కప్పి "పడుకో, సత్తిబాబూ" అని చెప్పి అమ్మ డాబా దిగిపోయింది.

నేను పొద్దున్న లేచే సరికి ఇంటినిండా జనం ఉన్నారు. అమ్మా, పిన్నీ ఏడుస్తున్నారు. పక్కింటి రామాయమ్మగారు ఇద్దరిని ఓదారుస్తున్నారు. ఇంతలో ఒకాయన వచ్చి "అక్కా, బాధపడకు. బావ బాగున్నాడులే. కాకినాడ పెద్దాసుపత్రిలో ఉన్నాడు. పరీక్షలు అన్నీ పూర్తి అయిన తరువాత ఈ సాయంత్రము ఇంటికి పంపించివేస్తాము అని డాక్టర్లు చెప్పారు. చిన్న డాక్టరు నాకు ఏమి చెప్పాడో తెలుసా? "ఈయన అదృష్ట వంతుడు. సామర్లకోట స్టేషను నుండి గాంధీ గారి రైలు కదిలిన తరువాత పోలీసులు కాంగ్రెసు కార్యకర్తలపై లాఠీ చార్జీ చేసేరు. ప్రజలు చెల్లాచెదురుగా పరుగులు పెట్టేరు. కొందరు కింద పడి పోయారు. కింద పడినవారిపై మరికొందరు తొక్కుకుంటూ పారిపోయారు. ఈయనకు తలకు మాత్రమే దెబ్బ తగిలింది. ఎముకలు విరగలేదు. ఒక వారము రోజులు శలవు పెట్టమని చెప్పేము."

ఆ సాయంత్రము చిన్నాన్న నైను డవును రైలు బండిలో దిగాడు. తలపై పాగాకు బదులు, గాజు గుడ్డతో కట్టిన కట్టు ఉంది. ఎడమ చేతిలో ఖద్దరు సంచి, కుడి చేతిలో కాంగ్రెసు జెండా ఉన్నాయి. తలకు గాయమైనా, చిరు నవ్వుతో నన్ను చూసి "సత్తి బాబూ, ఎప్పటికైనా నీవు గాంధీ గార్ని చూడాలి రా" అన్నారు.

Post your comments on this article